# భిన్నరూపాలు

ఆదివారంపొద్దున్న కాఫీ తాగుతూ వార్తాపత్రికలో వార్తలు నములుతున్నాను.

పట్నపు పొలిమేరల్లో బందిపోటు దొంగలు ఇళ్లు దోచుకుంటున్నారన్న వార్త, ఆ విషయంలో తగు చర్య తీసుకొంటున్నామని, కనుక ధైర్యంగా ఉండమని రక్షక సిబ్బంది చేసిన ప్రకటనలు ప్రముఖంగా కనిపించాయి.

ఊరు చివర దిక్కూమొక్కూ ఉండదు. కొత్తగా ఇళ్లు కట్టుకోదలుచుకన్నవాళ్లకి అక్కడగాని స్థలాలు దొరకవు.

మా పెద్దలిచ్చిన ఇల్లు ఊరుకి మధ్యగా ఉంది కనుక దొంగల భయంలేదని నాకు ధైర్యం.

నాకు దొంగతనానికి గురైనవాళ్లంటే జాలి. జడ్జీలు దొంగలకి కఠిన శిక్షలు వెయ్యాలని నా అభిప్రాయం. పేజీ తిప్పాను. "ఓట్లెయ్యకపోతే మీ వాడనంతటని మసి చేస్తాం. నుసి చేస్తాం" అని అధికారం పక్షం బెదిరించి, కొంత ప్రత్యక్షంగా జరిపి చూపించి, హరిజనుల ఓట్లు సంపాదించిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. "ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న చోట అవి మాత్రం ఇటువంటి వాగ్దానాలు చెయ్యలేదా? చెల్లించుకోలేదా? అని ముఖ్యమంత్రి బెదిరింపుల్ని వాగ్దానాలుగా చమత్కరించి ప్రశ్నించారు" అన్న వార్త చదివాను. రాజకీయాలల్లో హరిజనుల ఓట్లు దోచుకోవటం పరిపాటి. హరిజనుల పట్ల నాకు జాలి ఉంది. రాజకీయాలింత హీనస్థితికి దిగజారకుండా ఉంటే బావుండును.

ఇంట్లో గిన్నెల శబ్దాలు అవుతున్నాయి. అంటే నూకాలమ్మ పనిలోకి వచ్చిందని అర్థం. మా ఆవిడ వరలక్ష్మి, వినటానికిష్టపడే వార్తాప్రసార కేంద్రం నూకాలమ్మ. నూకాలమ్మ వచ్చి ముగ్గుపెట్టడానికి నీళ్ల బకెట్టుతో, చీపురుతో నేను కూర్చున్న వీధి అరుగుమీదకి దండెత్తలేదంటే ఇవాళ ఏదో గట్టి వార్తే తెచ్చిఉంటుంది.

నూకాలమ్మ బదులు వరలక్ష్మి వచ్చింది. వస్తూనే, "ఇది విన్నారా?" అని అడిగింది ఉపోద్ఘాతంగా.

"నూకాలమ్మ నాకు చెప్పందే" అన్నాను పత్రిక మడిచి ఖాళీ అయిన కాఫీ గ్లాసు వరలక్ష్మి చేతికందిస్తూ. నేను ఖాళీ కాఫీ గ్లాసు చేతికందిస్తే మామూలుగా అయితే, "అక్కడుంచకూడదా నూకాలమ్మ తీస్తుంది!" అంటుంది. ఇవాళ మాట్లాడకుండా అందుకొని

"సుభద్రా వాళ్లిల్లు దోచుకున్నారట" అంది.

"ఎప్పుడు?"

"రాత్రి"

"వాళ్లు ఊళ్లోలేరా?"

"ఉన్నారు".

"సినిమాకి వెళ్లారా?"

"లేదు"

"హోటలుకు వెళ్లినప్పుడా?"

"శనివారపు ఫలహారం నిన్న ఇంట్లోనే చేశారట".

సుభద్ర, ఆమె భర్త సుబ్బారావు శనివారాల రాత్రులు అన్నం తినరు. హోటలుకు వెళ్లి మసాలదోసెల్లాంటి ఫలహారాలు చేస్తారు. ఆ నోరులేని వెంకటేశ్వర్లు అవి తనే తిన్నట్టుగా సంతోషిస్తాడనుకొంటాను.

"ఇంతకూ మరి దొంగలు ఇంట్లోకి ఎల్లా ప్రవేశించారట?" వరలక్ష్మి అప్పుడు చెప్పింది నూకాలమ్మ చెప్పగా తను విన్న వైనం.

రాత్రి పదకొండు గంటలప్పుడు తలుపుకొట్టిన చప్పుడు విని లేచిందట సుభద్ర. శనివారాల రాత్రిళ్లు ఎప్పుడైనా పై ఊళ్లో ఉన్న కొడుకు రఘు, కోడలు సీత వస్తూ ఉంటారుట. వాళ్లే అయిఉంటారని సుభద్ర ధైర్యంగా తలుపు తెరిచిందట. ఆ వెంటనే నలుగురు లోపలికి తోసుకు వచ్చారట. ఒకడు తలుపు గడియ పెట్టాడుట. మరొకడు కత్తి ఝుళిపిస్తూ, "అరిస్తే పొడిచేస్తాను". అని సుభద్రని బెదిరించాడట. ఈ గొడవకి సుబ్బారావు గారు లేచి వచ్చేసరికి "బుద్ధిగా చెప్పినట్లు చెయ్యమని లేకపోతే మీ ఆడదాని ప్రాణం ఆ పైన నీ ప్రాణం తీస్తాం" అని బెదిరించారుట.

ఆ విధంగా ఇద్దరిని భయపెడ్తూ బీరువాలు పెట్టెలు తెరిపించి, డబ్బు, నగలు, వెండి సామానులు, పట్టుచీరలు మూటగట్టారుట. అందులో రఘు పెళ్లి సామానులు అన్నీ ఉన్నాయిట. వెళ్తూ వెళ్తూ సుభద్ర మెళ్లో గొలుసులు, మంగళసూత్రాలతో పాటు నిలువు దోపిడీ చేశారుట. చెవులకున్న దుద్దుల్లో ఒకదాని శీల రాకపోతే బలవంతంగా చెవి తెంపి తీసుకుపోయారుట. అంత కథా చెప్పి,

"ఒకసారి వెళ్లి చూసి రండి" అంది వరలక్ష్మి.

"వెళ్లమంటావా?"అని అడిగాను.

"వద్దంటే మానేసేటట్టు. అయినా సుభద్ర చెవి తెగిందంటే మీకు చీమ కుట్టినట్టయినా లేదా!" అని ఆశ్చర్యం ప్రకటించింది.

సుభద్రని పలకరించి వచ్చే అవకాశం కోసం నేను ఎదురు చూస్తూ ఉంటానని అనుమానించేది వరలక్ష్మి, మాకు పెళ్లయిన కొత్తల్లో, అంటే ముప్పై ఏళ్ల క్రితం.

ఇప్పుడు నేను, తను, సుభద్ర యాభయ్యోపడుల్లో అడుగుపెట్టాక అలవాటుగా

ఎత్తి పాడుస్తూ ఉంటుంది, ఎప్పుడైనా.

నాకు సుభద్రకి ముప్పైయేళ్ల క్రితం విడిగా పెళ్లిళ్లయ్యాయి. ముప్ఫయి అయిదేళ్ల క్రితం సుభద్రని నాకిచ్చి చేయాలని ఇటువాళ్లు అటువాళ్లు అనుకొనేవారు. ముప్ఫయి అయిదేళ్ల క్రితంకి మధ్య కాలంలో నేను చెడ్డ పేరు సంపాదించుకొన్నాను. నేను సిగరెట్లు కాలుస్తానని చాలామందికి తెల్సింది. ఆడపిల్లల్ని అల్లరిపెడ్తానన్న ప్రఖ్యాతి వచ్చింది. అన్నింటికి మించి ఏ డాక్టర్నో, ఇంజినీర్నో అవుతానని వాళ్లు అనుకొంటే కేవలం లెక్చరర్ని అయి వూరుకొన్నాను. అందుకని సుభద్ర తల్లిదండ్రులు ఇంజినీరైన సుబ్బారావుకిచ్చి పెళ్లి చేశారు. సుభద్ర ఏ పేచీ పెట్టకుండా చేసుకొంది. అందుచేత సుభద్ర నన్ను ఒకప్పుడు ప్రేమించింది అని కాని అభిమానించింది అని కాని చెప్పుకోడానికి దాఖలాలు లేవు. నాకు రోమియో పేరు రావటానికి కారణభూతురాలైన మా పక్కింటి వరలక్ష్మి, మా ఇంటి మహాలక్ష్మి అయింది. ఒకే పేట వారమైన మా ముగ్గురికి ఒకరితో ఒకరికి బాగానే స్నేహం ఉండేది.

ఈ ముప్పై ఏళ్లలోను సుబ్బారావు ఈ ఊళ్లోనే ఉద్యోగం సంపాదించి, అత్తవారింట్లో స్థిరపడ్డాడు. సుబ్బారావు మంచివాడు, దైవభీతి కలవాడు అన్న పేరు సంపాదించుకొంటే, నేను మొండివాడు, నాస్తికుడు అన్న పేరు సంపాదించుకొన్నాను. మా పైతరం వెళ్లిపోయింది. మేమే పెద్దలం ఇప్పుడు మా కుటుంబాలకి.

వరలక్ష్మి తమాషా అయిన మనిషి. మా పెళ్లయిన మొదటి నుంచి సుభద్రని అక్కయ్యా ! అని పిలవకసోయినా సుబ్బారావుని బావగారు అంటూ వ్యవహరించేది. మా పెళ్లయ్యేనాటికి నాకు సుభద్ర మీద పిసరంతైనా అభిమానం మిగిలి ఉంటుందని అనుమానిస్తే సుబ్బారావుని అన్నయ్యగారు అని వ్యవహరించి జాగ్రత్త పడేది. ఆ మాటకొస్తే నన్ను పెళ్లి చేసుకొనేదికాదు.

అయితే సుభద్ర పెళ్లాడటానికి పనికిరాడని వదిలేసిన నన్ను తను పెళ్లి చేసుకోవటం వల్ల సుభద్రకి తను లోకువేమోనన్న శంక వరలక్ష్మికి ఉంది. అందుకని తను" మీ సుభద్ర" అని వ్యవహరించినప్పుడల్లా సుభద్ర పట్ల నాకు ప్రేమగాని, గొప్ప అభిప్రాయంగాని లేవని, నేను కోరుకొన్నది, పెళ్లాడిందీ వరలక్ష్మి నేనని చెప్పి ఆమె ఆత్మవిశ్వాసాన్ని ఎగదోయటమే ఆమె నానుంచి ఆశించేదని నాకు త్వరగానే అర్థమైపోయింది.

"సుభద్ర కట్టు కున్న చీరె బావుంది కదూ !"

" ఆ చీర తనకంటే నీ వంటికే ఎక్కువ నప్పుతుంది.కాని నువ్వు కట్టుకున్న చీర ఆ చీరకంటే బావుంది నా కళ్లకి".

" ఆ చీర కొనమని అడగనులెండి" అంటుంది వరలక్ష్మి. నా పథకం పోల్చుకున్నట్టు. తను ఆశించింది నేను చీర కొనటం కాదు. సుభద్ర కంటే తనే మిన్న అని నేను అనటం. వరలక్ష్మి

వెర్రిది. నాకు ఏ ద్రాక్షలు పులుపో ఏవి తీపో అర్థం చేసుకోదు.

సుభద్రా సుబ్బారావులు అర్నెల్ల కోసారి సత్యనారాయణ వ్రతం చేసుకొని పిలుస్తూ ఉంటారు. " అంతకుముందు ఎన్నో సార్లు విన్న ఆ వ్రత కథలు, ఆ తరువాత ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠతతో నేను వినలేను. వినకపోతే సత్యనారాయణకి కోపం వస్తుంది. కనుక రాను". అంటాను వరలక్ష్మితో.

"మనం ఎల్లాగూ చేసుకోం. కనీసం ఇంకోళ్ళు చేసుకొంటున్నప్పుడు వెళ్లడానికేం రండి". అని పట్టు పడ్తుంది" వరలక్ష్మి. నేను వెళ్తాను.

"ఎంతైనా ఓల్డ్ ఫ్లేమ్ కదా!" అంటుంది వరలక్ష్మి. వ్రతాలు చేసుకొనేవారికి, చేయించే వారికి లాభసాటి. వెళ్లటం వరలక్ష్మిలాంటి వారికి చెలగాటం. నాకు ప్రాణసంకటం. సుభద్ర ఇంట్లో నేను అనాలోచితంగా అన్న మాటో, చేసిన పనో తరువాత నన్ను దెప్పి పొడవడానికి వరలక్ష్మి వాడుకొంటుంది. నన్ను ఆ విధంగా ఇరుకున పెట్టి, తన కార్యాలేమైనా ఉంటే సాధించుకొంటుంది.

ప్రపంచంలో ఇతర్ల చేత వారి కిష్టంలేని పని నయాన్న చేయించలేమని భయాన్న మాత్రమే చేయించగలమని వరలక్ష్మి నమ్మే సూత్రం. భయాన్న చేయించుకోడానికి తనకి నేను తప్ప ఎవరున్నారు. అందుకే చేస్తాను.

వరలక్ష్మికి సుభద్రతో పోటీ ఉన్నా, ఆమె కొడుకు రఘు అంటే విపరీతమైన ప్రేముండటానికి కారణం మాకు పిల్లలు లేకపోవటమే ! రఘు పెళ్లి సీతతో సంభవం అవటానికి రఘు కోరగా, నడుం కట్టి వరలక్ష్మి శ్రమించింది. రఘు సీత పరస్పరం ప్రేమించుకొన్నారు. కాని అంతస్థులు అడ్డుపడ్డాయి. రఘు ఒక పెద్ద ఇంజినీరు కొడుకు కావటమే కాక తను స్వయంగా ఇంజినీరు. సీత నా తోటి లెక్చరర్ నరసింహం కూతురవటమే కాక అతని ఆడ సంతానంలో మధ్యది. మొదటి ఆడపిల్ల పెళ్లికి శక్తికి మించి ఖర్చుపెట్టి కొంత చితికాడు నరసింహం. సీతకి కాస్త ఆడంబరంగా పెళ్లి చేస్తే మూడో పిల్లకి గుళ్లో దండల మార్పిడి పెళ్లి చెయ్యగలుగుతాడు. కాస్త పొదుపుగా సీత పెళ్లి చేస్తే రెండు పెళ్లిళ్లు సమంగా చెయ్యగలుగుతాడు.

" ఏం చూశావ్ సీతలో ! అందము, చదువు అయితే అంతకంటే చదువుకొన్న అందమైన అమ్మాయిని చూస్తాం. సీతను చేసుకొంటే మన అచ్చట్లు ముచ్చట్లు ఆ బో...." రఘు, సుభద్ర ఏమందో చెప్తూ, నా ఎదుట మాట పూర్తి చెయ్యటానికి జంకాడు. వరలక్ష్మి "ఫరవాలేదు చెప్పు" అని వత్తిడి చేసి చెప్పించింది.

"ఆ బోడి లెక్చరర్ ఏం తీర్చగలడు అంది అమ్మ" అని పూర్తి చేశాడు. లెక్చరర్ని అయిన నా ఎదుట, వాళ్లమ్మ వాడిన విశేషణం నోరు జారి చెప్పినందుకు చింతిస్తూ. సుభద్రకి

లెక్చరర్లంటే ఘనమైన అభిప్రాయం ఉంటుందని నేను అనుకోలేదు. తన భర్త ఉద్యోగాన్ని బోడి ఉద్యోగం అని సుభద్ర అనటం వరలక్ష్మికి కోపమే తెప్పించిందో తద్వారా నాకు సుభద్రకు మధ్య దూరం పెరుగుతుందని సంతోషించిందో నాకు తెలియదు.

రఘుకి కావలసింది గుణాలకి సీత, రూపానికి రంభ అన్న నమ్మకం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోను ఆమెను వదులుకోడానికి సిద్ధంగా లేడు. " ఈ పెళ్లి జరగకపోతే పిచ్చివాడినై పోతాను". అని మాతో అన్నాడు.

" నేను మీ అమ్మతో మాట్లాడ్తాను" అని వరలక్ష్మి భరోసా ఇచ్చింది.

వరలక్ష్మి సుభద్ర ఇంటికి వెళ్లింది. సుభద్రకి చాలా విధాల నచ్చ చెప్పింది. "పిల్ల బంగారు బొమ్మ. మీరు కాదనటానికి నాకు కారణం కనిపించదు. నువ్వు చెప్తే బావగారు కాదనరు సుభద్రా!".

" నాకున్నది ఒక్కడే కొడుకు. ఏ ముచ్చటా, వైభవమూ లేకుండా వాడి పెళ్లి జరగటం నాకిష్టం లేదు. నీకేం నువ్వెన్నన్నా చెప్తావ్ ! ఒక కొడుకును కని ఉంటే తెలిసేది".

సుభద్ర వరలక్ష్మి అయువుపట్టులో దెబ్బకొట్టింది. కార్యం సాధించదలుచుకొని వెళ్లిన వరలక్ష్మి ఆ అవమానాన్ని మింగి,"ఒక్కడే కొడుకు కనుకనే వాడు పిచ్చివాడై పోకూడదు"అంటూ ఒక పెద్ద పిరికి మాత్ర వేసింది సుభద్రకి.

"తెచ్చుకొనేటప్పుడు కిందింటి పిల్లను తెచ్చుకొంటే అణిగి ఉంటుందంటారు. అలోచించు. కన్నకొడుకు కోసం నువ్వు నీ ఆశలు కొన్ని త్యా గం చెయ్యాలి. పిల్లల విషయంలో కన్నతల్లి త్యాగం చేయగలిగినట్టు ఈ ప్రపంచం మీద ఎవరూ త్యాగం చెయ్యలేరు. అది నా అనుభవంలోకి రాకపోయినా నేను చూస్తూ ఉన్న విషయం. నేను కూడా రఘు పెళ్లి లోటుగా జరిగితే భరించలేను. పెళ్లి ఏ లోటు లేకుండా జరిపించమని నరసింహం గారితో చెప్పమని మా వారితో చెప్తాను" అని నచ్చ చెప్పింది వరలక్ష్మి, సుభద్రకి.

సుభద్ర క్రమేపి మెత్తబడింది. తను బిగదీస్తే మా అండ చూసుకొని రఘు ఏ రిజిస్టరు పెళ్లో చేసుకొని ఎదురు తిరగవచ్చునని భయపడింది.

" మావాడు ఆ పిల్లే కావాలంటున్నాడు కదా అని దాన్ని అలుసుగా తీసుకొని ఆ నరసింహంగారు అన్నీ ఎగకొడ్తానంటే కుదరదు. కట్నాలు లాంఛనాలు అన్నీ సవ్యంగా జరిపించే బాధ్యత మీ అయనది."

సుభద్ర మాటలు వరలక్ష్మి నాకు చెప్పింది.

" నరసింహం గారి దగ్గరేముందని ఇస్తాడుట !" అన్నాను.

"లేకపోతే ఎక్కడ్నుంచైనా తెచ్చి ఇవ్వమనండి. లేకపోతే ఈ పెళ్లి జరగదు" అంది నిక్కచ్చిగా వరలక్ష్మి. ఆపైన నరసింహం దగ్గరకి రాయబారం పంపింది నన్ను .

" నాకు రఘులాంటి అల్లుడు రావటం సంతోషమే! కాని వాళ్లకి ఏమేమి కోర్కెలున్నాయో అవి తీర్చగల తాహతు నాకుందో లేదో తెలుసుకోకుండా ముందుకు పోలేను" అన్నాడు నరసింహం.

సుభద్ర దగ్గరకి వరలక్ష్మి, నరసింహం దగ్గరకి నేను ఓ వారం రోజులపాటు తిరిగి కొన్ని విషయాలలో అంగీకారానికి వచ్చేలా చేశాం.

"పెళ్లికి ముందు రోజు సాయంత్రం టిఫిన్ నుంచి, పెళ్లి మర్నాడు బ్రెక్‌ఫాస్ట్ దాకా మగపెళ్లి వారికి భోజనాలు ఏర్పాట్లు చేయాలి."

"అట్లాగే చేస్తాను"

పిల్లవాడికి తాంబూలాలప్పుడు, ఎదురు సన్నాహం సమయంలోను, కన్యాధార సమయంలోను, గృహప్రవేశం సమయంలోను సూట్లు పెట్టాలి".

"ఆంధ్రాలో సూట్లు వేసుకొనే కాలమే లేదు కాదా ! లాగు చొక్కాలు పెడ్తాను".

"కుదరదు"

కన్యాధార అప్పుడు తాంబూలాలప్పుడు సూట్లు పెట్టేటట్టు మిగిలిన రెండు సమయాల్లోను కాస్త మంచి పాంటు గుడ్డలు, షర్టు గుడ్డలు, పెట్టేటట్టు రాజీ కుదిర్చాం.

"పెట్టే సూట్లు టెరివూల్‌వే పెట్టాలి. పైగా అవి పెళ్లి టైముకి కుట్టించి ఇవ్వాలి."

" అంటే కుట్టు ఛార్జీలు కూడా నేనే పెట్టు కోవాలన్న మాట. సరే తప్పేదేముంది! కుట్టిస్తాను. కాని ఆవిడ రిసెప్షన్ అంటోందేమిటి ? " అన్నాడు నరసింహం నాతో.

" ఏదో చిన్న వేడుక" అంది సుభద్ర వరలక్ష్మితో.

" వాళ్లింట్లో గృహప్రవేశం అయిన సాయంత్రం చేసుకోమనండి " అన్నాడు నరసింహం . కాని చివరికి ఈ పెళ్లి జరగదేమోనన్న భయంవల్ల పెళ్లి నాటి సాయంత్రం రిసెప్షన్ ఏర్పాటు చేయడానికి ఒప్పుకున్నాడు.

"అడబడచులు లేరు కనుక నాలాంఛనాలే ఘనంగా ఉండాలి. అంటే నాకు పెట్టే చీరలన్నీ పట్టువై ఉండాలి.

" చీరలు?"

"తాంబూలాలప్పుడు అప్పగింతలప్పుడు ఎల్లాగూ పెడ్తారు. గృహప్రవేశం అప్పుడు వాళ్ళ అమ్మాయితో పాటు నాకు పెట్టాలి."

"గృహప్రవేశానికి మా అమ్మాయికి సాధారణమైన చీరపెట్టినా ఈవిడకి పట్టు చీరపెట్టాలా!'

"వాళ్ళ అమ్మాయికి మధుపర్కం తప్పించి అన్నీ పట్టు బట్టలే పెట్టాలి. అబ్బాయికి కూడా పట్టు తాపితాలు పెట్టాలి."

నరసింహం ఇవన్నీ ఒప్పుకున్నాడు. వెండి బంగారాల సంభాషణలు ఆగిపోతూ కుంటుతూ నడుస్తూ ముందుకు సాగాయి. అమ్మాయికి పెట్టే నగలు అబ్బాయికి ఇచ్చే వెండి చెంబు, కంచం, బంగారపు ఉంగరం ఏది ఎంతెంత బరువుండాలన్న విషయంలో భేదాభిప్రాయాలు వచ్చాయి.

"నేను ఇంతకన్నా తూగలేను. ఇంతకంటే పెడ్తే నేను నా భార్య మిగిలిన పిల్లలు వీధిలో నిలబడి ముష్టెత్తుకోవాలి" అంటూ చేతులు ఎత్తేశాడు నరసింహం.

సీత మా ఇంటికి వచ్చి, "ఈ పెళ్ళి ఎల్లాగైనా జరిగేలా చూడండి మావయ్యగారూ?' అంటూ భోరున ఏడ్చింది.

"ఈ పెళ్ళి ఎల్లాగైనా జరిగితీరాలన్న పట్టింపు రఘుకి ఉంటే అతని తల్లిదండ్రుల్ని సర్దుకోమని చెప్పచ్చు కదా!" అన్నాను.

సీత రఘుకి ఉత్తరం వ్రాసింది. రఘు వచ్చాడు.

"ప్రతీ విషయం తెగేదాకా లాగటం నాకిష్టం లేదు. ఈ పెళ్లి మీరు చెయ్యకపోతే నేనే చేసుకొంటాను" అంటూ రఘు చిందులు వేశాడు.

"నువ్వు చిన్నవాడివి. నీకు తెలియదూరుకో! మనం గట్టిగా నిలబడకపోతే వాళ్ళు అన్నీ ఎగగొడ్తారు. ఆఖరికి పెళ్ళి వారికి ఓ పూట భోజనం కూడా సరిగా పెట్టరు. మనం అక్కర్లేదంటే ఆ డబ్బు కూడా ఆ మూడో పిల్ల పెళ్ళిలో ఖర్చు పెట్టి డాం ఢూం అని చేస్తారు.' అంది సుభద్ర. సుభద్ర అన్నదాంట్లో యదార్థం ఉన్నట్లు వరలక్ష్మికి కూడా తోచింది. ఆ విధంగా సుభద్ర ఆలోచించటం ధర్మమే అనుకొన్నాను.

"నాకు ఆ వెండి కంచాలు, ఉంగరం అక్కర్లేదు. అయన్ని ఇబ్బంది పెట్టకండి." అన్నాడు రఘు.

"అవి ఇవ్వకపోతే ఈ పెళ్ళి జరగదని బెదురు మనం పెట్టకపోతే - ఆయన రాల్చగలిగింది కూడా రాల్చడు. ఆయన ఇంతవరకు ఒప్పుకొన్న వాటిలో ఏవి తనంతట తానుగా ఇస్తానన్నాడుట. మొదట్లో ఇవ్వడానికి ఇష్టపడనివి తరువాత ఇవ్వటానికి ఎల్లా ఒప్పుకొన్నాడట? మనుషులెవరు ఓ పట్టాన తమకున్నది ఇతర్లకివ్వరు. అందుకని మనం బిగదీసుకున్నట్లు నటించాలి. ఈ పెళ్ళి నిజంగా ఆగిపోతుందేమోనన్న భయం కలిగితే అప్పుడు వాళ్ళు ఎక్కివస్తారు. నిజంగా ఎక్కలేని పరిస్థితుల్లో ఎక్కరు. అప్పుడే మనం ఓ మెట్టు దిగచ్చు. ఈ పెళ్ళి జరిగే తీరుతుందిరా పిచ్చి నాన్నా!" అంది సుభద్ర.

నరసింహం అప్పటికే తన పరిస్థితి బొటాబొటిగా ఉందని ఇంక డబ్బులేదని చెప్పాడు నాకు.

"ఎల్లాగో కట్నం ఇవ్వటం లేదు కదండీ! అప్పో సొప్పో చేసి ఇప్పటికి పబ్బం

గడపండి. కార్యం కానివ్వండి" అని చెప్పి చూశాను.

"హాయిగా రిజిస్టర్ పెళ్లి చేసుకోండర్రా ఏ గొడవ ఉండదు. సాక్షి సంతకం నేనూ మా ఆవిడా పెడ్తాం" అని రఘుకి, సీతకి సూచించాను.

"మధ్య మనకెందుకుట చెడ్డ పేరు. ఇటువైపు వారు అటువైపు వారు కలిసి మనకి అక్షింతలు వేస్తారు" అంది వరలక్ష్మి.

తన పెళ్ళి అక్క పెళ్ళిలాగే జరగాలని, దానికి బంధువులు, స్నేహితులు అందరూ రావాలని, తన పెళ్ళిలో తను మంచి బట్టలు కట్టుకోవాలని ఖరీదైన నగలు వేసుకోవాలని కోరుకొంది సీత.

"ఆడపిల్లల జీవితంలో అది మరపురాని రోజు. దానికోసం కొంత ఖర్చు ఆడపిల్ల తండ్రి భరించాల్సిందే" అంది వరలక్ష్మి.

"తండ్రి ఖర్చు భరించలేకపోతే సీతే ఆ ఖర్చుకు ఒప్పుకోదు. ఆకాడికి నేను అనవసరంగా మా వాళ్ళ మనసులు కష్టపెట్టడం ఎందుకు ! అందులోను వాళ్ళు నా పెళ్ళి నేను కోరుకున్న పిల్లతో జరిపిస్తున్నప్పుడు" అనుకొన్నాడు రఘు.

సీత మనసు తెలిసి నరసింహం రఘు సంబంధం వదులుకోలేక పోయాడు. అడకత్తెరలో పోకచెక్కలా నలగటానికే సిద్ధపడ్డాడు. అందుకని కాస్త కాస్తగా ఎక్కివచ్చాడు. నరసింహం దగ్గర వీలైనంత వరకు రాబట్టుకోడమేకాని, సీతని వదలుకొనే ప్రసక్తిలేదు. కనుక సుభద్ర సుబ్బారావు కొంచం దిగి వచ్చారు.

పెళ్ళి బాగా జరిగింది. రఘు,సీత సంతోషించారు.

నరసింహం పి.యఫ్. నుంచి ఎంత అప్పుచేయటానికి వీలవుతుందో అంతా తీసుకొన్నాడు. ఆపైన జలగల లాంటి వడ్డీ వ్యాపారస్థుల దగ్గర ఆరువేలు అప్పు తీసుకొని పెళ్ళి జరిపించాడు. కాని సుభద్ర సుబ్బారావులు కోరుకొన్న స్థాయిలో పెళ్ళి జరగలేదు!

ఆ తరువాత అప్పుల వాళ్ళు కాలేజీకి వచ్చి వడ్డీ కోసం నరసింహం పరువు తీస్తూ ఉంటే చూసి అప్పు నేను తీర్చాను. "మీ దగ్గరున్నప్పుడే తీరుద్దురుగాని" అని అంటే కాని ఈయన నా దగ్గర డబ్బు తీసుకోడానికిష్టపడలేదు. ఆయన అప్పుల్లో మునగటానికి నేను కూడా బాధ్యుడినే కనక ఆ సహాయం చేసి నా వాటా పాపం ప్రక్షాళన చేసుకొన్నాను. నరసింహం లాంటి వాళ్ళను చూస్తే నాకు జాలి.

నరసింహంకి అప్పుల వాళ్ళ వల్ల కలిగిన అవమానం కళ్ళారా చూశాక నేను నరసింహాన్ని ఖర్చుకి ఒప్పించకుండా ఉండాల్సిందని,అప్పుడు సీత, రఘు సరైన నిర్ణయం తీసుకొనేవారని చిన్నపిల్లల ముచ్చట తీర్చటం పెద్దల ధర్మం అంటూ నాలాంటి మధ్యవర్తులు మధ్యలో దూరి ఒక పక్షం వారికి మాత్రమే అనుకూలమైన ధర్మాలు చెప్పటం తప్పని, అల్లా

చేసి పిల్లలని ఎదగనీయకుండా చేశానని, వాళ్ళ సమస్యకి నా పరిష్కారం సరైనది కాదని అనిపించింది నాకు. అందుకనే నరసింహం ఇంటికి సీత కొడుకు బారసాలకి, సుబ్బారావింట్లో రఘు కొడుకు అన్న ప్రాసనకి వెళ్ళలేదు. ఆ రెండు సార్లు వరలక్ష్మి ప్రయత్నాలు ఫలించలేదు.

మళ్లీ ఇన్నాళ్లకి సుభద్రా వాళ్లింట్లో దొంగలు పడ్డ కారణంగా సుభద్ర చెవి తెగి గాయం అయిన సందర్భంగా నన్ను వరలక్ష్మి వెళ్లి పలకరించి రమ్మని బలవంత పెడ్తోంది.

నేను లేచి కాళ్లకి చెప్పులు తగుల్చుకొని గేటు దాటి గేటు మూయబోతూ వెనక్కి తిరిగిన నాకు, "ఎంతైనా, ఓల్డ్ ఫ్లేమ్ కదా! వెళ్లకుండా ఉండగలరా!" అన్న భావం తొణికిసలాడుతూ వరలక్ష్మి పెదవుల మీద ఓ చిర్నవ్వు కంటబడింది.

సుభద్ర చెవికి ప్లాస్టర్‌తో తలుపు తీసింది. సుబ్బారావు సుభద్రలను చూడగానే, గతరాత్రి అనుభవానికి ఎంతగా నలిగిపోయారో, నీరసపడిపోయారో కదా అని జాలి కలిగింది. ఇల్లంతా అన్ని వస్తువులు చిందర వందరగా విరజిమ్మి ఉన్నాయి. టెలిఫోన్ ఉరి తీయబడిన మనిషి లాగా క్రేడిల్ నుంచి వేళ్లాడ్తోంది. పోలీసులకి కంప్లైంట్ ఇవ్వమని, సహాయానికి రమ్మంటే నేను వస్తానని సుబ్బారావుకి చెప్పాను. దోచుకోనే వాళ్లు దోచుకుపోగా మనిషిని గాయపరచడం క్రూరం! సుభద్రా వాళ్లకీ రోజు మనుష్యుల పలకరింపు చాలా అవసరం. రావటం మంచిదే అయిందినే వాళ్ల దగ్గర సెలవు తీసుకొని బయల్దేరిన నాకు నరసింహం గుర్తుకు వచ్చాడు. బహుశహ వాళ్ల వియ్యంకుడన్న కారణంగా అయి ఉండవచ్చు. ఆయనను చూసి చాలా రోజులైందని అటు మళ్లాను.

నరసింహం నేను వెళ్లేసరికి ట్యూషన్లు చెప్తున్నాడు. "మంచు, నీరు, నీటి ఆవిరి చూడటానికి వేరుగా ఉన్నా రసాయనికంగా మూడు ఒకటే ఆ భిన్నరూపాలు వేడిలో తేడాల వల్ల కలిగినవే".

నన్ను చూసి పాఠం ఆపి నరసింహం ఆప్యాయంగా ఆహ్వానించాడు. రెండేళ్లయినా తను నాకు తీర్చని అప్పు గురించి వచ్చాననుకొన్నట్టున్నాడు. "మీ అప్పు త్వరలో తీరుస్తాను" అని ఒక శుష్కహాసం చేశాడు. అందులో జీవం లేదు. మనిషి నీరసంగా కృంగిపోయి ఉన్నాడు. అలిసిపోయి ఉన్నాడు.

"తొందరలేదు" అని చెప్పి సుభద్ర ఇంట్లో దొంగతనం గురించి చెప్పాను.

"వెళ్లి పలకరిస్తాను" అన్నాడు. నేను ఇంటికి బయల్దేరాను.

ఆయన దైన్యస్థితిని చూసాక ఇందాకట్నుంచి మబ్బుచాటు చందమామలాగా ద్యోతకం అయీ అవకుండా నన్ను ఇబ్బంది పెడ్తున్న భావం అర్థమైంది.

దుడ్డు రాబట్టటానికి సుభద్ర చెవి తెంచాడు, దొంగ. కట్నం, కానుకలు రాబట్టటానికి నరసింహాన్ని కష్టపెట్టింది సుభద్ర. ●

(ఆంధ్రసచిత్ర వారపత్రిక నవంబర్ 1985)